తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
28 ఫిబ్రవరి 2025
పేజీలు : 08




Follow :

## హెవీ వాహన డ్రైవర్లకు
# ఉచిత కంటి పరీక్షలు

- సైబరాబాద్ పోలీసుల 'అరైవ్ అలైవ్' ఫేజ్-2:
- ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ అవసరం
- హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి
- మద్యం సేవించి డ్రైవింగ్ ప్రాణాంతకం



శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 27: రోడ్డు ప్రమాదాలను అరికట్టి, ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరేలా చేయడమే లక్ష్యంగా సైబరాబాద్ పోలీసులు 'అరైవ్ అలైవ్' ఫేజ్-2 కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వట్టినాగులపల్లిలోని ఎంఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం భారీ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) ఆధ్వర్యంలో ప్రిస్టిన్ ఐ హాస్పిటల్స్ ప్రిస్టిన్ విజన్ ఫౌండేషన్ సహకారంతో లారీ, టిప్పర్, డీసీఎం, బస్సులు తదితర హెవీ వాహనాల డ్రైవర్లకు అనుభవజ్ఞులైన ఆప్టోమెట్రిస్టులు పరీక్షలు నిర్వహించారు. దాదాపు 220 మంది డ్రైవర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు.
సీపీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ యుద్ధాల్లో మరణించిన వారి కంటే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళనకరమని అన్నారు. కంటి చూపు లోపాలు (లాంగ్ డిస్టెన్స్, షార్ట్ డిస్టెన్స్, సైడ్ విజన్ బ్లర్) ఉన్నప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అలాంటి సమస్యలు ఉన్నవారు త్వరగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తన కుటుంబ సభ్యుల మాదిరిగానే రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రత కూడా ముఖ్యమని భావించి, అందరూ డిఫెన్సివ్ డ్రైవింగ్ మెళకువలను పాటించాలని పిలుపునిచ్చారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ వాహన దారుడితో పాటు పిలియన్ రైడర్లు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగేళ్లు పైబడిన పిల్లలకు కూడా ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. హడావిడిలో హెల్మెట్ మరచిపోవడం, జుట్టు రాలుతుందనే సాకులు చెప్పడం వల్లే అనేక ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.
ట్రాఫిక్ విభాగం డీసీపీ-2 శేషాద్రి నిరెడ్డి మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ట్రాఫిక్ నియమాలను బాధ్యతగా పాటిస్తే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రిస్టిన్ ఐ హాస్పిటల్స్ వైద్యురాలు శ్రావ్య మాట్లాడుతూ దూరం, దగ్గర, పక్క వైపు చూపు స్పష్టంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన వారు చిన్న కంటి సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ ఆదిమూర్తి, ఎస్సీఎస్సీ సీఈఓ నావెద్ ఖాన్, ప్రిస్టిన్ ఐ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది, వివిధ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, భారీ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



## జేవీ కాలనీ అక్రమ నిర్మాణాలపై అధికారుల మక్కువ

- కార్పొరేటర్ ఫిర్యాదు చేసినా అధికారుల నిర్లక్ష్యం
- సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆరోపణలు
- ప్రజలు, మీడియా హెచ్చరికలు వద్దు

## పసిపాప మృతికి కారకులైన
# వారిని కఠినంగా శిక్షించాలి

- మండల తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందించిన
- నవాబుపేట్ మండలం దళిత సంఘం నాయకులు



**నవాబుపేట్ ఫిబ్రవరి 27(జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని దళిత సంఘాల నాయకులు పసిపిల్లల్లో ప్రాణం తీసిన దుండగులను వెంటనే శిక్షించాలంటూ నవాబుపేట్ తాసిల్దార్ బుచ్చయ్య, వినతి పత్రాన్ని అందించిన నవాబుపేట్ మండల దళిత సంఘాల నాయకులు శుక్రవారం వారు మాట్లాడుతూ పసి పాపా అని కనికరం లేని కఠినాత్ములు అది పాప ఉన్నది అని చూడకుండా కండకవురంతో అగ్రకురా అహంకారంతో ఉండిపసి పసి పాపని ఎత్తుకొని మందిరానికి వెళ్లి మొక్కులు తెచ్చుకుందా మని పూజకార కార్యక్రమానికి వెళుతుండగా నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మెర గ్రామంలో జరిగిన సంఘటనను దేవాలయ ప్రవేశాని అడ్డుకొని అనేక బూతు మాటలు తిట్టి కొట్టి రెండు నెలల అమ్మాయిని కాళ్లతో తన్ని చంపిన సంఘటన జీర్ణించుకోలేని పరిస్థితుల్లో ఉన్నటువంటి తల్లిదండ్రులు బంధుమిత్రులు చాలా బాధాకరమని సంఘటన ఆ గ్రామంలో ఉన్నటువంటి అగ్రకులాల అహంకారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నటువంటి నవాబుపేట్ మండల డిప్యూటీ తాసిల్దార్ నవీన్ రెడ్డి,దళిత రత్న అవార్డు గ్రహీత బి శివరాజు నవాపేట, మండల కోశాధికారి నింగిజాన్, మండల సీనియర్ నాయకులుబేగారీ శ్యామ్ రావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులుశివ ప్రసాద్, అత్తాపురం గ్రామ అధ్యక్షులు టిఆర్ఎస్ యాదగిరి, నింగి పాండు,మండలఅంబేద్కర్ నవాబుపేట్ మండల వివిధ గ్రామాల యువజన సంఘాల నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో రోడ్డు పనులు ప్రారంభం

**పూడూర్ ఫిబ్రవరి 27 (జనం సాక్షి) :** చేవెళ్ల పార్లమెంట్ పరిగి నియోజకవర్గం పూడూరు మండల కేంద్రంలోని చీలాపూర్ గ్రామంలో ఎంపీ నిధులతో సీసీ రోడ్డును బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ మెంబర్ మల్లేష్ పటేల్ మరియు పూడూరు మండల కేంద్ర అధ్యక్షులు రాఘవేందర్ ఆధ్వర్యంలో వేయించడం జారింది ఈ కార్యక్రమం చీలాపూర్ మాజీ సర్పంచ్ రాములు భూత్ అధ్యక్షులు సత్యనారాయణ సుభాన్ మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు



## తాండూరు అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

- ఖండించిన కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా



**యాలాల ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు అభివృద్ధిలో దూసుకుపోతుంటే ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు అక్బర్ బాబా అన్నారు. బుయ్యని సోదరులపై బీఆర్ఎస్ యాలాల మండల నాయకులు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. యాలాల వార్డు సభ్యుడు ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య, ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు బుర్ణపురి నర్సిములు, కార్యదర్శి అహ్మద్, నాయకులు గొల్ల శ్రీనివాస్, జోగు నర్సిములు తో కలిసి విలేకరుల సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక మతి లేకుండా మాట్లాడుతున్నారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ల పేరిట ఇసుక అక్రమ రవాణాకు పాల్పడింది బీఆర్ఎస్ నాయకులని అన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఇంటి నిర్మాణానికి టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలించుకుపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్బీఓఎల్ కంపెనీ తరపున ప్రతి ఏడాదికి మూడు లక్షల రూపాయలను భారత సైన్యానికి కేటాయిస్తున్న ఎమ్మెల్యే సోదరుడిపై నిందలు వేయడం తగదన్నారు. ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు



సికింద్రాబాద్ (జనంసాక్షి) : మోండా డివిజన్ ఓల్డ్ జైల్ ఖానా వద్ద గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పూజలు నిర్వహిం చారు. ఆలయం నిర్మించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగాశతాబ్దిఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలో పునఃప్రతిష్టించిన లక్ష్మీ నారాయణస్వామిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే వెంట ఆలయ చైర్మన్ ఈశ్వర్ నాగ సంతోష్, ఈఓ పూర్ణ చందర్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకులహరికృష్ణ, నాయ కులు తలసాని స్కైలాబ్ యాదవ్,గందె నాగులు, కొండా పురం మహేష్ యాదవ్,ఆల యకమిటీ సభ్యులు ఆనంద్, సాయిబాబా, భాస్కర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవా కార్యక్రమాలు

### లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి - షాది ముబారక్ చెక్కుల పంపిణీ



ఉప్పల్ ఫిబ్రవరి 27 (జనంసాక్షి): విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ ఉప్పల్ నియోజకవర్గంలో సంక్షేమం మరియు విద్యాభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉప్పల్ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఉప్పల్ మండలానికి చెందిన మొత్తం 151 మంది లబ్ధిదారులకు ఈ సందర్భంగా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హుల చేతికి చేరాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. పేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు లక్ష నూట పదహారు రూపాయల ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం అందించే విధానం అమల్లోకి రావాలని తాను అభిప్రాయ పడ్డారని తెలిపారు. ఇది పేద కుటుంబాలకు మరింత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పూల్ సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉప్పల్ జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని విద్యార్థులకు స్వయంగా ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతి జీవితంలో ఒక కీలక దశ అని, క్రమశిక్షణతో చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధ్యమేనని సూచించారు. పరీక్షలను భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు. తల్లిదండ్రులు, గురువులు చూపుతున్న మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా రంగ అభివృద్ధికి అవసరమైన సహాయం అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు.



## విద్యార్థికి సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చిన కానిస్టేబుల్



ఉప్పల్ ఫిబ్రవరి 27 (జనంసాక్షి): ఉప్పల్ చౌరస్తా వద్ద మానవత్వాన్ని చాటిన ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాయడానికి వచ్చిన ఓ విద్యార్థి పరీక్ష సమయంపై గందరగోళానికి గురై ఆందోళన చెందుతూ ఉండగా అక్కడే విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అప్రమత్తంగా స్పందించారు.విద్యార్థి పరిస్థితిని గమనించిన శ్రీనివాస్ వెంటనే అతనిని ధైర్యం చెప్పి, సమయం వృథా కాకుండా తన ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టి కేవలం మూడు నిమిషాల్లోనే సురక్షితంగా పరీక్ష కేంద్రానికి చేర్చారు. ట్రాఫిక్ రద్దీ ఉన్నప్పటికీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థి పరీక్షకు ఆలస్యంకాకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల తక్షణ స్పందనతో విద్యార్థి సమయానికి పరీక్ష హాల్లోకి చేరుకుని పరీక్ష రాయగలి గాడు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబ సభ్యులు పోలీసు అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో పోలీసుల పట్ల ఉన్న నమ్మకాన్ని ఇలాంటి చర్యలు మరింత బలపరుస్తాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. పోలీసు శాఖ విధుల్లో కేవలం శాంతిభద్రతలు మాత్రమే కాకుండా, అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా నిలబడటమే తమ బాధ్యత అని ఈ ఘటన మరోసారి నిరూపించింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ చేసిన ఈ సేవకు స్థానిక ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మండల విద్యాధికారి అశోక్‌కు సన్మానం



మర్పల్లి (జనంసాక్షి): విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి మండలంలోనూ తన ఫస్ట్ విసిటింగ్ ను తాను చిన్నప్పుడు చదువుకున్నటు వంటి ప్రాథమిక పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భం గా ప్రాథమిక పాఠశాల సిబ్బంది శాలువతో సత్కరించారు. తను చదువుకున్నటువంటి పాఠశాలకు విజిట్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎంఈఓగా చార్జ్ తీసుకున్న సంతోష కరమైన సమయంలో ఎంఈఓ తనే స్వయంగా స్వీట్స్ తీసుకువచ్చి విద్యార్థు లకు అందించడం జరిగింది . ఈ సందర్భంగా సిబ్బందికి అకాడ మిక్ సంబంధించిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది ఉపాధ్యా యులు ఎల్లప్పుడూ విద్యార్థుల జ్ఞాన అభివృద్ధికై కృషి చేయాలని సూచించ డం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిపురం పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మణికొండ జలమండలి జీఎం.శ్రీనివాస్ రెడ్డికి ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు




రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి): మణికొండ ప్రాంతంలోని నీటి సరఫరా వ్యవస్థను సమర్థంగా పర్యవేక్షించి పలు దీర్ఘకాలిక సమస్యలను హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించాలని ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ కొనియాడారు. గురువారం శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా మణికొం డలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలను క్లియర్ చేయడం, క్యాన్ నంబర్లను రెగ్యులరైజ్ చేయడం ద్వారా అనేక కుటుంబాలకు ఉపశమనం కలిగించారని చెప్పారు. ప్రమోషన్ అనంతరం తిరిగి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపారని, అధికారులు ప్రజల మధ్య సమన్వయం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించిన ఆయన సేవలను పలువురు అభినందించారు. పదవీ విరమణ అనంతరం శ్రీనివాస రెడ్డి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సింహ రాజా రెడ్డి, బాబురావు, కృష్ణ కుమార్, శంకర్ దేవ్, డా. పి. అవినాష్, కిషన్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత

తాండూరు (జనంసాక్షి): మృతుల కుటుంబాలకు బాలాజీ నర్సింగ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ ఆర్థిక చేయూత నందించారు. శుక్రవారం తాండూర్ మండలం దస్తగిరిపేట్ గ్రామానికి చెందిన బుడిగజంగం లింగమ్మ అకాల మరణం చెందారు. అదేవిధంగా తాండూర్ పట్టణం 16వ వార్డ్ కు చెందిన నీరటి రాము అకాల మరణం చెందారు విషయం తెలుసుకున్న బాలాజీ నర్సింగ్ అధినేత డాక్టర్ సంపత్ కుమార్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి యొక్క అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఎర్రం శ్రీధర్,పాస్టర్ భాస్కర్, అమ్రేష్ ముదిరాజ్, సంగం శీను, లాలప్ప, మొగులప్ప, వెంకట్, రమేష్,గుండు,బద్రి, అజంతా, దేవప్ప సురేష్, పాల్గొన్నారు.



## యాచారంలో రేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



యాచారం, (జనంసాక్షి): ఆలయాల సందర్శనతో ఆధ్యాత్మిక దైవచింతన, మానసిక ప్రశాంతతను మరింత పెంపొందించుకోవచ్చని సర్పంచ్ మస్కు అనిత శరణం అన్నారు. యాచారంలో ఎల్లమ్మ గుడి పునర్నిర్మాణ పనులకు సర్పంచ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. అత్యాధునిక హంగులతో వినూత్నమైన రీతిలో ఆధునిక పద్ధతుల్లో సాంకేతికత ఉట్టిపడేలా దేవాలయ నిర్మాణాన్ని కొనసాగించనున్నట్లు చెప్పారు. ఆలయాలు కేవలం పూజ స్థలాలు మాత్రమే కాదని ఆధ్యాత్మిక భక్తి భావాన్ని పెంపొందించే నిలయాలుగా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చెప్పారు. కార్యక్రమంలో 4వ వార్డు సభ్యులు జెల్ల శ్రీనాథ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మస్కు నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల భాస్కర్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వలిగొండ నరసింహాకు ఓయూ డాక్టరేట్



సికింద్రాబాద్ (జనంసాక్షి): ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం నుండి వలిగొండ నరసింహ డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమణ పర్యవేక్షణలో " డిమాండ్ ఫర్ స్టేట్ అటానమీ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ఇండియన్ ఫెడరల్ సిస్టమ్: ఎ స్పెషల్ స్టడీ ఆన్ తమిళ్ నాడు స్టేట్ " అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి వలిగొండ నరసింహ సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రధానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. వలిగొండ నరసింహ విద్యార్థి ఉద్యమాలలో తనదైన పాత్ర పోషించి మంచి నాయకుడుగా నిలిచాడు.ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# సాయి దామంలో బజరంగ్ దళ్ శిక్షణ వర్గ ఏర్పాట్లపై సమీక్ష

- కుషాయిగూడలో 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని సందర్శించిన బజరంగ్ దళ్ జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి..
- హిందువుల ఐక్యతే సమాజ బలమని కార్యకర్తలకు పిలుపు




**కాప్రా, ఫిబ్రవరి 27 (జనంసాక్షి)** : మార్చి 7 నుంచి 14 వరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సాయి దామంలో నిర్వహించనున్న అఖిలభారత బజరంగ్ దళ్ శిక్షణ వర్గ (శిబిరం) ఏర్పాట్ల పరిశీలన, సమీక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా అఖిలభారత బజరంగ్ దళ్ జాతీయ అధ్యక్షులు కిషన్ ప్రజాపతి కుషాయిగూడకు విచ్చేసి శిబిర ఏర్పాట్లపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ బస్ స్టాప్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం కుషాయిగూడ శివాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. నేటి యువత ధర్మ మార్గంలో నడవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఖండించారు. 'లవ్ జిహాద్' పేరుతో హిందూ యువతులను లక్ష్యంగా జరుగుతున్న సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిందువులను కులాల వారిగా విభజించి ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ హిందువులంతా సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత్ బజరంగ్ దళ్ సంయోజక్ కుమారస్వామి, తెలంగాణ విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ రాష్ట్ర బజరంగ్ దళ్ సంయోజక్ శ్రీకాంత్, భాగ్యనగర్ సంయోజక్ విశాల్, కుషాయిగూడ ప్రఖండ ప్రముఖ సాకేత్ అరుణ్, యశ్వంత్ సాగర్, రాగిరి వరుణ్ సాకేత్, బీజేపీ నాయకులు సురేందర్ గౌడ్, ఆనంద్ గౌడ్, రేగొండ వెంకులు, లక్ష్మణ్ గౌడ్, గణేష్ గౌడ్, వెంకటాచలం, జీవీఎన్ రావు, సంపత్ రావు, సహదేవ్ గౌడ్, పిట్టల రాజు, దయానంద్, అప్పి, శ్రీకాంత్, శ్రీధర్, సోమేశ్ నాయుడు, పాల్గొన్నారు.

## నేడు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు



**మోమిన్ పేట ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** మోమిన్ పేట మండల పరిధిలోని వెల్చల్ గ్రామానికి చెందిన గొల్ల పర్మయ్య స్వామి గుట్టను తొలసి గుడిగా మలచిన ఏకైక వ్యక్తి. ఒక మామూలు మనిషి తన స్వహస్తాలతో గొడ్డలిని పనిముట్టుగా వాడి గుట్టను గుహగా మలిచిన ఏకైక వ్యక్తి గొల్లపర్మయ్యస్వామి. ప్రస్తుతం ఈ క్షేత్రం అద్భుత గుహాలయంగా మారి ఆధ్యాత్మికతకు ప్రత్యేకంగా నిలయంగా మారిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దివ్య క్షేత్రం రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందినది. ఎత్తయిన కొండలలో వెలసిన గుహ పచ్చని ప్రకృతిలో హల్లాదకరమైన వాతావరణం మరియు ,స్వచ్ఛమైన నీటితో నిండి ఉండే గుండం ఇచ్చట ప్రత్యేకత. అజంత గృహాలను పోలిన అద్భుత గుహాల యం తెలంగాణ అజంతగా గుర్తింపు చెందినది. ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం 1960 వ సంవత్సరంలో గ్రామస్తులకు తెలియడంతో, గ్రామస్తుల సహకారంతో దాతల సహాయంతో ఈ పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్నది. స్వామివారి కి నిత్య పూజలతో పాటు ప్రతి సంవత్సరం నిర్వహించే జాతర మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు అవుతున్నారు. ఈనెల 26న పాల్గొన శుద్ధ దశమి గురువారం నుండి శుద్ధ ద్వాదశి 28 శనివారం వరకు నిర్వహించడం జరుగుతుంది. 26న స్వామివారి ధ్వజా రోహణం, సాయంత్రం బోనాలు రాత్రి పల్లకి సేవ మరియు భజన కార్యక్రమా లు నిర్వహించడం జరుగుతుంది. 27న శుక్రవారం స్వామి వారి రథోత్సవం ఊరేగింపు, అనంతరం భజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. 28న పాల్గొన శుద్ధ ద్వాదశి శనివారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పెరుగు వసంతం, భక్త బృందం చే భజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి దైవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నారు.

## ఉప్పల్‌లో 'జీతాలు వద్దు.. యథావిధిగా ముద్దు' అంటూ స్వచ్ఛ ఆటో కార్మికుల వినూత్న నిరసన




**ఉప్పల్ (జనంసాక్షి):** ఉప్పల్‌లో జిహెచ్ఎంసి స్వచ్ఛ ఆటో కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. "జీతాలు వద్దు.. యథావిధిగా ముందు" అంటూ నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి వ్యాప్తంగా స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రస్తుత విధానాన్ని మార్చి నెలజీతాల విధానం అమలు చేయాలనే యోచనలో యంత్రాంగం ఉన్న నేపథ్యంలో కార్మికులు వ్యతిరేకత తెలిపారు.ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ద్వారా తమకు వచ్చే ఆదాయం సరిపడుగా ఉందని, జీతాల విధానం అమలు చేస్తే తమ జీవితం అగమ్యగోచరంగా మారుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలజీతం కింద స్థిర మొత్తాన్ని నిర్ణయిస్తే తమ ఆదాయం తగ్గిపోతుందని, కుటుంబ పోషణ కష్టమవుతుందని అన్నారు. దైనందిన ఖర్చులు, పిల్లల చదువులు, అద్దె భారం వంటి బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని యథావిధిగా ప్రస్తుత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ మార్పుల వెనుక రామ్కీ సంస్థ కుట్ర ఉందని కార్మికులు ఆరోపించారు. తమ అభిప్రాయాలను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని హెచ్చరించారు. కార్మికుల భవిష్యత్తును ప్రభావితం చేసే అంశాల్లో ముందుగా వారితో చర్చలు జరపాలని కోరారు. నిరసన కార్యక్రమం సందర్భంగా పెద్ద సంఖ్యలో స్వచ్ఛ ఆటో కార్మికులు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ఏఎస్ఐ ఆనంద్ గౌడ్



**బొంరాస్ పేట, (జనంసాక్షి):** మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఏఎస్ఐ ఆనంద్ గౌడ్ అన్నారు.బొంరాస్ పేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఏఎస్ఐ ఆనంద్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది బాలు నాయక్,రవి నాయక్,మల్లేష్, అశోక్ తదితరులు ఉన్నారు.

## 100 రోజుల సమగ్ర ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వందరోజుల సమగ్ర ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమం మార్చి 4 నుండి చేపట్టడం జరుగుతున్నది.రంగారెడ్డి జిల్లాలో ప్రజలకు మరింత సమగ్ర మరియు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు వందరోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని మూడు దశలలో అమలు చేయనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి తెలిపారు. మొదటి దశ మార్చ్ 4 నుండి మార్చి 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు స్పెషలిస్ట్ వైద్యులు నిర్ణయించిన తేదీలలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి సన్నాహక సమావేశము జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారుల మరియు ప్రోగ్రాం అధికారులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు జూము మీటింగ్ నిర్వహించడం జరిగింది. మొదటి దశలో మాతృ మరియు మహిళా ఆరోగ్యము శిశు ఆరోగ్యంలో భాగంగా అనీమియా స్క్రీనింగ్ మరియు చికిత్స ఐ ఎఫ్ ఏ మాత్రల పంపిణీ హైరిస్క్ గర్భిణీల గుర్తింపు మరియు పర్యవేక్షణ , ప్రసవానంతరం 14 రోజులలోపు గృహ సందర్శనలు మెన్సెస్ పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాలు, స్థన మరియు గర్భాశయ ముఖ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో నిపుణులైన గైనకాలజిస్ట్ ల చే పరీక్షించి గుర్తించిన వారికి చికిత్స అందజేయడం జరుగుతుంది. అదేవిధంగా పూర్తి టీకాల కార్యక్రమం బలోపేతం జీరో డోస్ పిల్లల గుర్తింపుమరియు ట్రాకింగ్ విటమిన్ ఎ పంపిణీ చిన్న పిల్లల డాక్టర్ ల చే గుర్తించి చికిత్స అందజేస్తారు. యువత కోసం అనీమియా నివారణ చర్యలు పరీక్షల ఒత్తిడి నివారణ చర్యలు పరీక్షల ఒత్తిడి నివారణ కౌన్సిలింగ్ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రత్యేక జేరియాట్రిక్ క్యాంపులు నిర్వహించి రక్తపోటు మధుమేహం మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి రిఫరల్ సేవలు అందించడం జరుగుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంగన్వాడీలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి ఈ కార్యక్రమాన్ని పకడ్బందీ గా అమలు చేస్తున్నట్లు తెలిపారు గ్రామ పట్టణ స్థాయిలో విస్తృత స్క్రీనింగ్ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఆర్ బిఎస్కే వైద్యుల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలో కంటి పరీక్షలు రక్తహీనత పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ గీతా డాక్టర్ రాధిక డాక్టర్ పాపారావు డాక్టర్ లక్ష్మీప్రసన్న మరియు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిభా హయత్ డెమో శ్రీనివాసులు మరియు సూపర్వైజర్ లు తదితరులు పాల్గొన్నారు.




## మహిళలకు ఇంటర్ప్రినర్షిప్ డెవలప్మెంట్ పై ఒక్కరోజు శిక్షణ



**ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** ఎస్ఆర్డి రాంనగర్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఇంటర్ప్రినర్షిప్ డెవలప్మెంట్ పై శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేనేజర్ ఎమ్మెస్ కార్తీక హాజరై మహిళలకు అవగాహన కల్పించారు. 60 మంది మహిళలకు ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయించి, దానివల్ల వారికి ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు అర్హులవుతారని దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్డిటీం రాంనగర్, కె వెంకటేశ్వరి, ఆశ్ర జాబిన్, కే కీర్తన పాల్గొన్నారు.

## సెమా గ్లూటైడ్‌తో మధుమేహానికి చికిత్స

**ఖైరతాబాద్, (జనంసాక్షి)** : దేశంలో వేగంగా పెరుగుతున్న మధుమేహం, ఊబకాయం సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రముఖ ఔషధ సంస్థ జైడుస్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శర్విల్ పటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు.ఆయన మాట్లాడుతూ సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు ముగిసిన రోజే ఈ ఇంజెక్షన్‌ను భారత మార్కెట్లో విడుదల చేయాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. టైప్-2 మధుమేహం, ఊబకా యం చికిత్స కోసం ఈ ఔషధాన్ని సేమగలైన్, మశే మా, ఆల్టర్మే బ్రాండ్ పేర్లతో అందుబాటులోకి తేనుం దని చెప్పారు. తయారీ, విక్రయాలకు ఔషధ ని యంత్రణ అధికారి అనుమతులు ఇప్పటికే లభిం చాయని పేర్కొన్నారు. జైడస్ అభివృద్ధి చేసిన 15 మి.గ్రా 3 మి.లీ ప్రీఫిల్డ్ కార్ట్రిడ్జ్ ప్రత్యేక రీయూజబు ల్ పెన్‌తో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఒకే పెన్ ద్వారా అవసరానికి అనుగుణంగా మోతా దును సర్దుబాటు చేసుకునే విధానం ఇందులో ప్రధాన ఆకర్షణ అన్నారు. ఇప్పటి వరకు వేర్వేరు మోతాదులకు వేర్వేరు పెన్లు వినియోగించాల్సిన పరిస్థితికి ముగింపు పలుకుతూ, ఈ కొత్త విధానం రోగులకు సౌలభ్యం, ఖర్చు తగ్గింపు రెండింటినీ అందించనుం దని తెలిపారు. చికిత్సను క్రమంగా కొనసాగించడంలో ఇది ఉపయుక్తమవుతుం దని వైద్య వర్గాలు భావిస్తున్నాయని అన్నారు.

## ఓయూలో డాక్టర్ అంబేద్కర్ ఆలోచన విధానంపై ఓయూలో జాతీయ సదస్సు



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ణ్ ఆధ్వర్యంలో నిడాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు: రాజ్యాంగబద్ధత, సామాజిక న్యాయం , సమగ్ర దేశ నిర్మాణయ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మార్పు కు విద్యే అత్యంత శక్తి వంతమైన ఆయుధమని ఉద్ఘాటించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగ విలువలు పరిపాలన, విద్య మరియు ప్రజా జీవితానికి దిక్సూచిగా ఉండాలని పేర్కొన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యను బలోపే తం చేయాలని, లింగ, సామాజిక అసమానతలను తొలగించి నైపుణ్యం కలిగిన విద్యను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మారుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలలో విద్యా ప్రణాళికలను అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.లింగప్ప, ప్రొఫెసర్ ఐ.డెయిసీ, ప్రొఫెసర్ ఎం. కృష్ణ కుమార్, డాక్టర్ జె.మాధవి, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ కొండ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నిజం గెలిచింది.. రాజకీయ కుట్రే

### దత్తాత్రేయ రావు వ్యాఖ్యలు



**తాండూరు (జనంసాక్షి):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి బయటకు వచ్చిన అనంతరం బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత భావోద్వేగ వ్యాఖ్య లు చేశారు.నినిజం గెలిచింది.. కడిగిన ముత్యంలా బయటకు వచ్చా ను అని తెలిపారు. తనపై పెట్టిన కేసు పూర్తిగా రాజకీయ కుట్రేనని దత్తాత్రే య రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని, ముఖ్యంగా మాజీ సీఎం కే. చంద్రశేఖర్ రావును టార్గెట్ చేయడానికే ఈ కేసు పెట్టారని పేర్కొన్నారు. నిమూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు. కానీ చివరకు నిజం వెలుగులోకి వచ్చిందిఅని అన్నారు. ఈ సంద ర్భంగా తల్లిదండ్రులు, అత్తామామలు, తన పార్టీ నాయకులకు, జాగృతి నాయకులు,కష్టకాలంలో అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు.నినాకు అండగా నిలిచిన వారిని ఎప్పటికీ మరిచి పోను అని కవిత స్పష్టం చేశారు.

## క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కివి వివేకానంద గౌడ్ అన్నారు. శుక్రవారం సూరారం డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నగర్ లో రాహుల్ రెడ్డి, సుభాష్ రెడ్డి, రవిష్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లార్విన్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్య నారాయణ, సురేష్ రెడ్డి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, నాయకులు యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీను, శ్రీనివాస్, అమృత, బషీరుద్దీన్, అజయ్, సిద్ధు, మన్నేగణేష్, గుమ్మడి ప్రసాద్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిబద్ధతకు తోడుగా సాంకేతిక పరిజ్ఞానంతో అప్రమత్తత

- 30 నిమిషాల్లోనే చిన్నారిని రక్షించిన పోలీసులు.
- ఎస్ఐ సుమలత,ఏఎస్ఐ సతీష్ కుమార్ మెరుపు స్పందనలి
- రంగారెడ్డి,ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ప్రతినిధి,



**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 27(జనంసాక్షి):** నిబద్ధత,అంకితభావం ఉంటే ఎంతటి క్లిష్టమైన కేసునైనా చేదిస్తారనేదానికి నిదర్శన మె ఈరోజు తప్పిపోయిన చిన్నారి బాలిక విషయంలో మరోసారి నిజమైంది..రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంప ట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఏడేళ్ల చిన్నారిని పోలీసులు కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే సురక్షితంగా గుర్తించి,తల్లిదండ్రులకు అప్పగించి వారి కళ్లలో ఆనందాన్ని నింపారు.వివరల్లోకి వెళ్తే...నిజామాబాద్ జిల్లా, చిరికొండ మండలం,రావుట్ల గ్రామానికి చెందిన అంజలి – రాజు దంపతులు తమ ఏడేళ్ల కుమార్తె ఆద్యతో కలిసి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఒక హాస్టల్‌లో ఉంటున్న బంధువులను చూడటానికి వచ్చారు.ఈ క్రమంలో చిన్నారి ఆద్య ఆడుకుంటూ బయటకు వెళ్లి, దారి తెలియక తప్పిపోయింది.తమ బిడ్డ కనిపించడం లేదని ఆందోళనతో తల్లిదండ్రులు ఆశ్రయించగానే,ఎస్ఐ సుమలత,ఏఎస్ఐ సతీష్ కుమార్ తక్షణమే స్పందించారు.సాంకేతిక పరిజ్ఞానా న్ని సిబ్బంది యొక్క అప్రమత్తతను జోడించి చేపట్టిన ఈ సెర్చ్ ఆపరేషన్ వల్ల,చిన్నారి ఆద్యను అరగంటలోనే సురక్షితంగా గుర్తించడం సాధ్యమైం ది..క్షేమంగా ఉన్న తమ బిడ్డను చూసి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకు న్నారు.ఆపద సమయంలో ఇంత వేగంగా స్పందించి,తమ బిడ్డను తమకు అప్పగించినందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, ఇబ్రహీంపట్నం పోలీసులకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజల రక్షణే మా నిరంతర లక్ష్యం.తల్లిదండ్రుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చిన్నారిని కాపాడటం సంతృప్తిని ఇచ్చిందన్నారు.

## పూర్తి రికార్డులు సమర్పించండి .. చర్యలు చేపడతాం

### రాష్ట్ర ఎన్నికల కమీషన్ ను ఆదేశించిన హైకోర్టు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై తుది విచారణ మంగళవారానికి వాయిదా



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 27(జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా జరిగిన పూర్తి రికార్డులు , లైవ్ టెలికాస్ట్ వీడియో రికార్డింగులను సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను హైకోర్టు ఆదేశించింది. చైర్మన్ గా ఎన్నికైన తన నియామకాన్ని ప్రకటించాలని బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ టేకుల సుదర్శన్ రెడ్డి దాఖలు చేసిన పిటీషన్ ను శుక్రవారం విచారించిన హైకోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పిటిషన్ ను విచారించిన జస్టిస్ ఎన్ వి శ్రవణ్ కుమార్ ఈమేరకు ఆదేశాలు వెలువరించారు. సుదర్శన్ రెడ్డి తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సి.రఘు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యిందని , 15 మంది సభ్యుల మద్దతుతో సుదర్శన్ రెడ్డి చైర్మన్ గా ఎన్నికయ్యారని కోర్టుకు వివరించారు. వైస్ చైర్మన్ ఎన్నిక ప్రారంబిస్తుండగా హైకోర్టు స్టే ఇచ్చిందని చెప్పి ఫలితం ప్రకటించకుండా నిలిపివేశారని ఆయన తెలిపారు. సుదర్శన్ రెడ్డి ఏకగ్రీవంగా చైర్మన్ పదవికి ఎన్నికయ్యారని , కాలయాపన చేయడం కోసం సభ్యులచే చేతులెత్తించి , సంతకాలు చేయించి తదుపరి కోర్టు స్టే వచ్చిందని ప్రకటించారని ఆయన కోర్టుకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరిగిన చైర్మన్ ఎన్నికను ప్రకటించి వెంటనే వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఆయన కోర్టుకు విన్నవించారు. వాదనలు విన్న న్యాయమూర్తి చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తి రికార్డులు , వీడియో క్లిప్పింగులు కోర్టుకు సమర్పించాలని ఎన్నికల కమిషన్ ను ఆదేశించారు. తుది విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

### నీరుడు శేఖర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి27(జనంసాక్షి):** కంటి శుక్లాలతో బాధపడుతున్న నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నానని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, బీజేపీ నాయకుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. మార్చి 1 ఆదివారం బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుంది. కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరమైన వారికి తదుపరి తేదీన ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి మందులు, కంటి అద్దాలు అందజేస్తారు. ఈ శిబిరాన్ని యోగక్షేమం వహ్మ్యహం చారిటబుల్ ట్రస్ట్ , సాదూరం కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని శేఖర్ ముదిరాజ్ కోరారు.

## బీసీ అంశాన్ని ప్రజా క్షేత్రంలోకి పోవాలి

### ప్రతి ఇంటి తలుపు తట్టాలి
### ప్రజాస్వామ్యం ముసుగుణ భయంకరమైన కుట్ర అంతర్లీనంగా కొనసాగుతుంది
### మాజీ స్పీకర్ సిరి కొండ మధుసూదన చారి



**ముషీరాబాద్, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** బీసీ అంశాన్ని ప్రతి బీసీ ఇంటి తలుపు తట్టే విధంగా బీసీ సంఘాల నాయకులు బహుముఖంగా ఏకకాలంలో అనేక రూపాలుగా ప్రజా క్షేత్రం లోకి తీసుకుపోవాలని మాజీ స్పీకర్ సిరి కొండ మధుసూదన చారి సూచించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీసీ ఇంటలెక్చువల్ ఫోఫోరం, (బీసీ ఐ ఎఫ్)బీసీ పొలిటికల్ ఫ్రంట్ (బిపిఎఫ్) నాయకుల ఆధ్వర్యంలో బడ్జెట్లో బీసీలకు అన్యాయం ఇక సహించం, న్యాయం కోసం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ డిజిపి పూర్ణచందర్రావు,మాజీ స్పీకర్, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రిటైర్డ్ ఐ ఎస్ టి చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రెండ్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ పలువురు బీసీ నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి మాట్లాడుతూ ఈ దేశంలో ప్రజాస్వామ్యం ముసుగుణ ఒక భయంకరమైనటువంటి కుట్ర అంతర్లీనంగా కొనసాగుతుందన్నారు.ఈ కుట్ర ఫలితం ఏంటంటే ఈ దేశంలో దాదాపు 55,60% మెజార్టీగా ఉన్నటువంటి బీసీలకు రాజ్యాధికారంలో, సంపదలో వాటా దక్కకుండా చేయడం ఈ రెండు జరిగాయన్నారు. ఇవాళ దాని దుష్పరిణామాలు ఉండేటువంటి ఆధిపత్య కులాలు అగ్రకులాలు సంపద అనుభవించడానికి సుఖ ప్రదమైనటువంటి జీవితం గడపడానికి జీవితాలు కొనసాగుతుంటే, బీసీల జీవితాలు, సమస్యల్లో పుట్టి సమస్యల్లో పెరిగి సమస్యల్లో జీవితం ముగించడమే బీసీల జీవితంగా ఉందన్నారు. బీసీలకు దక్కవలసిన వాటిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అసలు రాజ్యాధికారం ఇస్తున్నామా. లేక గుంజుకుంటున్నారా అని అన్నారు. బీసీల వాటా గురించి రాష్ట్ర హైదరాబాద్ స్థాయి నుండి జిల్లా స్థాయి, జిల్లా స్థాయి నుండి నియోజకవర్గస్థాయి, నియోజకవర్గ స్థాయి నుండి మండల గ్రామస్థాయి వరకు ఈ విషయాలన్నీ తీసుకుపోగలిగితే చాలా వేగంగా పరిస్థితిని అర్థం చేసుకొని స్పందించేటువంటి సభ్య సమాజంలో మనం ఉన్నామన్నారు. ఆ దిశగా ప్రయత్నం కూడా జరగాలన్నారు. ఏది ఏమైనా తాము రాజకీయ పార్టీలో ఉన్నాం. రాజకీయ పార్టీ ప్రయోజనం ముఖ్యమైన కానీ అంతకంటే కూడా ముఖ్యంగా బీసీల ప్రయోజనాన్ని ఆశించి చేసేటువంటి ఏ కార్యక్రమంలోనైనా ఏ బాధ్యతను అయినా కూడా నిర్వర్తించడానికి బీసీ వాదులతో కలిసి పనిచేయడానికి సర్వదా సన్నద్ధంగా ఉంటామని అని అన్నారు.



## అప్రమత్తత, బాధ్యతతోనే నేరాలు తగ్గుతాయి

### సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన అవసరం : డీఎస్పీ మొగులయ్య

**అయిజ, ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** అయిజ పట్టణంలోని గాంధీచౌక్ సర్కిల్లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని జోగులాంబ గద్వాల జిల్లా డీఎస్పీ మొగులయ్య శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరల గురించి, సమాజంలో ప్రతి మనిషి ఎలా ఉండాలి తదితర అంశాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు, ఇలాంటి వాటిపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలో ప్రజలకు సిఐ టాటా బాబు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల కు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ద్విచక్ర వాహనదారులందరు హెల్మెట్ తప్పకుండా ధరించాలని అన్నారు. డీఎస్పీ మొగులయ్యమాట్లాడుతూ, అపరిచితుల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజలందరూ బాధ్యతగా మెలగాలని అలాంటప్పుడు నేరాల సంఖ్య తగ్గుతుందని డిఎస్పి మొగులయ్య సూచించారు. ఆరైన్ అలైవ్, ప్రధాన ఉద్దేశం ప్రజల భద్రత లక్ష్యంగా, పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని, అందుకు ప్రజలంతా సహకరించి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని డి.ఎస్.పి మొగులయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేకంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించ గలిగామని, డీఎస్పీ మొగు లయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజ పట్టణ ఎస్సై శ్రీనివాసరావు, తదితర పోలీసులు పాల్గొన్నారు.

## ముస్లింలకు సోదరులకు ఇఫ్తార్ విందు



**అమరచింత (జనంసాక్షి) :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి ఆత్మకూరు పట్టణంలోని మదర్స మస్జిద్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మౌలానా జియా ఉర్ రహ్మాన్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం అన్నదానం ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ తహసిల్దార్ చాంద్ పాషా , మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్టార్ ఫ్రెండ్స్ నిర్వాహకులు ఇస్మాయిల్, ఫెరోజ్, రఫీ నవాజ్, సాదిక్, కరెంట్ ఇస్మాయిల్, మార్బుల్ సాధిక్, అజ్మాత్, ఖాదర్, షానవాజ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన పలువురు



**కోట్‌పల్లి, ఫిబ్రవరి 27 (జనంసాక్షి):** నూతనంగా ఎన్నికైన వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి లను శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ కార్యాలయంలో కోట్ పల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్ర రెడ్డి, మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శశికాంత్, మండల్ పార్టీ సీనియర్ నాయకులు మాధవ్, రమేష్ రాథోడ్, మర్యాదపూర్వం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రమాదానికి గురైన నారాయణ స్కూల్ బస్సు

### విద్యార్థులకు స్వల్ప గాయాలు

**శంకర్ పల్లి,ఫిబ్రవరి 27 (జనంసాక్షి) :** కొండకల్ మోకిలా నుంచి విద్యార్థులను ఎక్కించుకొని శంకరపల్లి వస్తున్న నారాయణ హై స్కూల్ బస్సు ప్రమాదానికి గురి అయింది. 16 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారంగా శంకర్ పల్లి లోని నారాయణ స్కూల్ కు చెందిన బస్సులో కొండకల్ మోకిలా తండాలకు చెందిన సుమారు 35 మంది విద్యార్థులు శుక్రవారం ఉదయం 8:15 నిమిషాలకు పాఠశాలకు వస్తుండగా బస్సు ప్రమాదానికి గురైంది. మోకిల దాటిన తర్వాత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఉండటంతో ముందుగా వెళ్తున్న డీసీఎం వ్యాను వేగం తగ్గడంతో వెనుక నుంచి వేగంగా వస్తున్న స్కూలు బస్సు నియంత్రణ కోల్పోయి డీసీఎంను ఢీ కొట్టింది. బస్సు డ్రైవర్ అఖిల్ గౌడ్ సడన్ బ్రేక్ వేయడంతో అందులోని 16 మంది విద్యార్థులకు



స్వల్ప గాయాలయ్యాయి. భయాందోళనకు గురైన డ్రైవర్ అఖిల్ గౌడ్ ఘటనస్థలి నుంచి పారిపోయాడు. అయితే ప్రమాదం గురించి తెలుసుకున్న ప్రిన్సిపాల్ దివ్య వెంటనే మరో బస్సును సంఘటనస్థలి వద్దకు పంపారు పాఠశాల సిబ్బంది గాయపడ్డ విద్యార్థులను చికిత్స నిమిత్తం శంకర్పల్లిలోనే లలిత ఆసుపత్రికి తరలించారు. 16 మంది విద్యార్థులకు స్కానింగ్ తో పాటు ఎక్స్రేలు తీసి చికిత్స అందించారు. అందులో పది మంది విద్యార్థులకు వైద్యం అందించి వెంటనే ఇళ్లకు పంపారు ఆరుగురు విద్యార్థులకు మధ్యాహ్నము వరకు వైద్యులు చికిత్స అందించారు. డీసీఎం డ్రైవర్ మహేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిలా ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. బస్సు డ్రైవర్ అఖిల్ గౌడ్ పోలీసుల అదుపులో ఉన్నాడు.




# రైతు చెమటకు విలువ లేదా?

### రెండు నెలలు గడిచినా డబ్బులు రాలే..

**మర్పల్లి ఫిబ్రవరి 27 (జనంసాక్షి)**

రైతులను ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుండి కాపాడతామని ప్రభుత్వం ప్రకటించిన ధాన్య కొనుగోలు విధానం నేలమట్టమవుతోందని మండలంలోని రైతులు మండిపడుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మర్పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో 2025 డిసెంబర్ 12 తర్వాత మొక్కజొన్న ధాన్యం విక్రయించిన సుమారు 200 మందికి పైగా రైతులకు ఇప్పటికీ నగదు చెల్లింపులు జరగలేదు. దాదాపు రెండు నెలలు గడిచినా బ్యాంకు ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచలింగాల గ్రామానికి చెందిన రైతు మల్లేష్ శుక్రవారం సహకార సంఘం కార్యాలయానికి వెళ్లి తన మొక్కజొన్న కొనుగోలు డబ్బులు ఎప్పుడు వస్తాయని అధికారులను ప్రశ్నించగా, “ప్రభుత్వం నుంచి విడుదలైన వెంటనే జమ అవుతాయి” అనే సర్వసాధారణ సమాధానమే వినిపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో 200 మందికి






పైగా రైతుల ఖాతాల్లో చెల్లింపులు నిలిచిపోయాయని అధికారులు చెప్పినట్టు ఆయన తెలిపారు. పంట సాగు కోసం అప్పులు చేసి, ఎరువులు--విత్తనాలు కొనుగోలు చేసి, కూలీలకు చెల్లింపులు చేసి ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయామని రైతులు వాపోతున్నారు. రోజురోజుకు తీసుకున్న అప్పుపై వడ్డీ పెరుగుతోందని, ఇలా అయితే కుటుంబాలను ఎలా పోషించాలంటూ రైతు మల్లేష్ కన్నీటి పర్యంతమయ్యారు.

రైతు చెమటకు తగిన విలువ ఇవ్వాలని చెప్పే ప్రభుత్వం, ధాన్యం తీసుకున్న తర్వాత నెలల తరబడి చెల్లింపులు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రైతుల కష్టాలను అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది.